సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో హరి ప్రసాద్

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

డీపీవో హరిప్రసాద్

డోర్నకల్, జూన్ 28 : వానకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులను అరికట్టాలని డీపీవో హరిప్రసాద్ వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం 'ఫ్రై డే – డ్రై డే' కార్యక్రమం నిర్వహించాలన్నారు. మురికి నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మున్వర్ అలీ, ప్రాథమిక ఆరోగ్య అధికారి సద్విజ, సీహెచ్‌వో వీరాబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోమటిపల్లిలో వైద్య శిబిరం

ఇనుగుర్తి, జూన్ 28 : వానకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) ప్రవీణ్ అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన శుక్రవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నీలం యాకయ్య, కార్యదర్శి నిషాంత్, ఏఎన్‌ఎం మంజుల, ఆశ కార్యకర్తలు విజయ, మల్లిక, లలిత, బుజ్జి, సునీత తదితరులు పాల్గొన్నారు.



బంజారా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

1న బంజారా సమ్మేళనం

మహబూబాబాద్ రూరల్, జూన్ 28 : హైదరాబాద్‌లో జూలై 1న నిర్వహించనున్న బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా కో– ఆర్డినేటర్ బోడ లక్ష్మణ్‌నాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బంజారాల సమస్యలు, హక్కుల సాధన కోసం జరిగే ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. భూక్యా మోహన్, రాజేశ్, బట్టు కృష్ణ, భాస్కర్, నారాయణ పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులకు మేలు

కురవి, జూన్ 28 : అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులకు మేలు జరుగుతుందని ఏవో మంజూఖాన్ సూచించారు. కురవి మండలం తట్టుపల్లి గ్రామంలో పత్తిలో అధిక సాంద్రత పద్ధతి విధానాన్ని పాటిస్తున్న కుదురుపాక మల్లయ్య పత్తి పంటను పరిశీలించారు. రైతు ఆర్‌సీహెచ్–929, బీజీ–2 రకాన్ని వేశాడని, సాగు పద్ధతి ద్వారా ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వరి, రైతులు కుదురుపాక మల్లయ్య, పరమేశ్, కొల్లూరు సాయిలు, కాసీం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కరించాలి

కొత్తగూడ, జూన్ 28 : వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడ తహసీల్దార్ కార్యాలయంలో నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో మహిళలది ప్రధాన పాత్ర అని, ఆరోగ్యశ్రీ, ఇతర పథకాల ద్వారా ఉచితంగా వైద్యం అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ప్రభన్న, ఎర్రక్క, సమ్మక్క, పాపన్న, కొమయ్య, పాపన్న, రాజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

- టీచర్లు అంకితభావంతో పనిచేయాలి
- జిల్లా విద్యా శాఖాధికారి రామారావు

నర్సింహులపేట, జూన్ 28 : పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని డీఈవో రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని జడ్పీ పాఠశాలలో ప్రార్థనా సమయంలో తనిఖీ చేశారు. 10 తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలను విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తోటి విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలకు వచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. 10వ తరగతిలో 10 జీపీఏ వచ్చేలా విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులు తెలుగులో వెనకబడితే అన్ని సబ్జెక్టులపై ప్రభావం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామ్మోన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పూర్ణచందర్, సీఆర్పీలు శేషుకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.



నర్సింహులపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

చిన్నగూడూరు, జయ్యారం హైస్కూళ్లలో తనిఖీ

చిన్నగూడూరు : పదో తరగతి విద్యార్థులు పక్కా ప్రణాళికతో కష్టపడి చదివితేనే లక్ష్యసాధన సాధ్యమని డీఈవో రామారావు సూచించారు. శుక్రవారం ఆయన చిన్నగూడూరు, జయ్యారం ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన వారికే ఐఐటీల్లో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అన్ని సబ్జెక్టులపై దృష్టిపెట్టేలా ఉపాధ్యాయులు ప్రేరణ కలిగించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు రవికుమార్, ఉషశ్రీ, ఉపాధ్యాయులు రహెమాన్, సతీశ్‌రెడ్డి, వెంకన్న, నాగేశ్వర్, తేజొన్నతరెడ్డి, రామకృష్ణ, ఉపేందర్, శ్రీనివాస్, ఫిరోజ్ పాల్గొన్నారు.



పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేశ ఖ్యాతిని చాటిన మహానేత పీవీ

తొర్రూరు, జూన్ 28 : తెలుగు నేల మీద పుట్టి దేశ ఖ్యాతిని చాటిన మహానేత పీవీ నర్సింహారావు అని కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ అన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం..

బాలిక ఆత్మహత్య

తొర్రూరు, జూన్ 28 : ప్రేమపేరుతో మోసపోయి బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. చీకటాయపాలెం గ్రామానికి చెందిన బాలికను మాటేడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నరేశ్ ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక గురువారం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించగా శుక్రవారం రాత్రి మృతి చెందింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ బోనాల పండుగ

సీఐని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 28 : పట్టణంలోని గోపాలపురంలో ముదిరాజ్‌ల కులదైవం పెద్దమ్మ బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మతల్లి, పోతురాజు, పాండవుల గుడి వద్ద బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అతిథిగా సీఐ పెండ్యాల దేవేందర్, బీసీ సంఘం నాయకులు హాజరు కాగా, ఆలయ నిర్మాణ కమిటీ వారిని సన్మానించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జీ రాజు, హన్మంతు, ఉప్పలయ్య, బాలకృష్ణ, నర్సయ్య, అశోక్, వెంకన్న పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

గూడూరు, జూన్ 28 : కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేస్తున్నదని బీజేపీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేశ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల్లో కేవలం రెడ్డి వర్గానికే ప్రాధాన్యం ఇచ్చి, బీసీలకు అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఇంకా దొరల పాలన సాగుతున్నదని, ఓ దొర శాసిస్తేనే రెడ్డిలకు పదవులు వస్తున్నాయని, బీసీలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. నామినేటెడ్ పదవులల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బావిలో పడి ఒకరి మృతి

నర్సింహులపేట, జూన్ 28 : బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని నర్సిహాపురం బంజారా గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నిమ్మరబోయిన నరేశ్ (26) గొర్రెలు కాసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లిన గొర్రెలను మళ్లిస్తుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టెండర్లలో అవకతవకలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 28 : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో ఆహార పదార్థాలు, క్యాటరింగ్‌లో వేసిన టెండర్లు ప్రక్రియలో అవకతవకలు జరిగాయని టీజేఎస్ నాయకులు ఇరుగు మనోజ్ ఆరోపించారు. టెండర్ల ప్రక్రియకు జిల్లా అడిషనల్ కలెక్టర్ ద్వారా డ్రా తీసే విధానం ఉంటుందని, అలా కాకుండా పాఠశాల ప్రిన్సిపాల్ తన ఇష్టం వచ్చినవిధంగా వ్యవహరిస్తూ తనకు అనుకూలంగా ఉన్నవారికి టెండర్లను అప్పజెప్పినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ స్పందించి పూర్తి విచారణ చేయించాలని కోరారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

టీబీఎస్ఎఫ్ నాయకులు

గూడూరు, జూన్ 28 : గిరిజన బాలికల హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఏటీడీఏ డీడీ ఎర్రయ్యకు టీబీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్, నవ తెలంగాణ విద్యార్థి వ్యవస్థాపక అధ్యక్షుడు రామన్నానాయక్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్ వార్డెన్ విద్యార్థులతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నదని, సరైన వసతులు కల్పించడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. గత విద్యా సంవత్సరంలో హాస్టల్‌లో తక్కువ మంది ఉన్నా ఆన్‌లైన్‌లో ఎక్కువ మంది విద్యార్థులను ఎన్‌రోల్ చేసి లక్షల రూపాయలు డ్రా చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల ఐక్యవేదిక నాయకులు బానోత్ మోహన్, ఎల్ఎస్ఎఫ్ నాయకులు జాటోత్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

మహబూబాబాద్ రూరల్, జూన్ 28 : టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. జిల్లాలో 527మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 400 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో రామారావు తెలిపారు. 75.9 శాతం ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి డీఈవో, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500 చలాన్ తీసి వచ్చే నెల 8వ తేదీలోగా పోస్ట్ ద్వారా హైదరాబాద్‌కు పంపించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ తరపున చెక్ అందజేత

బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్‌ను అందజేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, జూన్ 28 : మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన మేకల సందీప్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభ్యత్వం ఉన్న కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అసలు స్వరూపాన్ని ప్రజలు ఇప్పుడు గమనించి, కేసీఆర్ చేసిన మంచి పనులను గుర్తు చేసుకుంటున్నట్లు తెలిపారు. అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ నైజం బయటపడిందని, బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం రావడం ఖాయమన్నారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వ హామీల అమలుపై దృష్టి సారించి, పనులు జరిగే వరకు ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుడు అల్లాబాబు తల్లి బొరిశెట్టి జయలక్ష్మి ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఎంబీసీ కులాల జిల్లా అధ్యక్షుడు భూపతి అనారోగ్యానికి గురికాగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, ఎన్నమనేని శ్రీనివాసరావు, ఎస్‌కే అంకూస్, నలమాస ప్రమోద్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, రాయిశెట్టి వెంకన్న, మంగళపల్లి ఆశయ్య, లేగల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ : పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

జూలై ఒకటి నుంచి నూతన చట్టాలు అమలు

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ■ పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ

మహబూబాబాద్, జూన్ 28 : జూలై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా నూతన చట్టాలు అమలు కానున్నాయని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నూతన చట్టాలపై జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నూతన చట్టాలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని పోలీస్ స్టేషన్‌లో వర్తింపజేయాలన్నారు. కొత్త చట్టాలను అనుసరిస్తూ పోలీసు అధికారులు, సిబ్బంది ముందుకు సాగాలన్నారు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం–2023పై జిల్లాలోని పోలీసులకు పూర్తి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన పొందితేనే నిందితులకు శిక్షలు, బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. అరెస్ట్‌లు, వాంగ్మూలం నమోదులో జాగ్రత్తలు పాటించాలని, నిందితులకు శిక్ష పడేలా పని చేయాలన్నారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదని, అవసరాన్ని బట్టి, ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాలకు రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. నూతన చట్టాల విధి, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నూతన చట్టాలను అమలు చేసేందుకు పకడ్బందీ ప్రణాళికలను రచించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీసీఆర్బీ డీఎస్పీ గండ్రాతి మోహన్, మహబూబాబాద్, తొర్రూరు సబ్ డివిజన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కురవి పోలీస్ స్టేషన్ తనిఖీ

కురవి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారులకు రసీదు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఆవరణలోని ఆహ్లాదకరమైన గార్డెన్‌ను పరిశీలించారు. కోర్టు విధులు నిర్వహించే అధికారుల రూమ్‌లో రికార్డ్స్ భద్రపర్చడం, 5ఎస్ అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని ఎస్సై గోపికి సూచించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తీర్చాలన్నారు. ఫిర్యాదుల్లో జాప్యం లేకుండా స్పందించాలన్నారు.

వరద నీటి నిల్వ ఉంటే అధికారులపై చర్యలు

- డ్రై డే నిర్వహించాలి.. శుభ్రత పాటించాలి
- మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

సైడ్ డ్రైనేజీని పరిశీలిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, జూన్ 29 : రహదారులు, డ్రైనేజీల్లో వాన నీరు నిల్వ ఉంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మహబూబాబాద్–ఈదులపూసపల్లి ప్రధాన రహదారి డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని అధికారులు, వైస్ చైర్మన్ వెంకన్నతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... 11, 24వ వార్డుల్లో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో సందర్శించి తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేసీబీల సాయంతో డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను తొలగించాలన్నారు. 24వ వార్డు ఇందిరానగర్ కాలనీలో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరిబోండాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రై డే – డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఈ ఉపేందర్, మార్నేని కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ క్రాంతి, గుగులోత్ శివ, వర్క్ ఇన్‌స్పెక్టర్ కౌశిక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, జవాన్ మధుసూదన్, అంగన్వాడీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు, జూన్ 28: తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బొలగాని రాములు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పొలిటకల్ సైన్–1, డెయిరీ సైన్స్–1, సెరికల్చర్–1, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ లో–1 పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ఓసీ, బీసీలకు 55శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీతో పాటు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 4.30 గంటలలోపు కళాశాలలో అందజేయాలన్నారు. కళాశాల విద్యా కమిషనర్ నిబంధనలను అనుసరించి ఎంపిక జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాలల జూనియర్ అసిస్టెంట్ అమరేందర్‌రెడ్డి 9542110611లో సంప్రదించాలన్నారు.

మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మహబూబాబాద్ రూరల్ : పట్టణంలోన నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల కోసం అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు, డెయిరీ సైన్స్ విభాగంలో రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయని, సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం ఉత్తీర్ణత, ఎస్సీ, ఎస్టీ వారికి 50 శాతం ఉత్తీర్ణత గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే 3న కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని, 2వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



లింగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఒప్పంద ఉద్యోగులు

తొర్రూరు, జూన్ 28: సమగ్ర శిక్ష అభియాన్ ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఒప్పంద ఉద్యోగ బాధ్యురాలు రాధిక అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి లింగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సమగ్ర శిక్ష అభియాన్ ఒప్పంద ఉద్యోగ బాధ్యులను రెగ్యులర్ చేస్తామని రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని అన్నారు. వెంటనే తమకు టైమ్ స్కేల్ వర్తింపజేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, డీటీఎఫ్ సంఘం ముఖ్యమంత్రి చొరవ చూపేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్య, బుదారపు శ్రీనివాస్, సమగ్ర శిక్ష అభియాన్ ఒప్పంద ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలి : ఎంపీపీ

పెద్దవంగర, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతోపాటు సమయపాలన పాటించాలని ఎంపీపీ ఎర్ర సబిత సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని చిట్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో వేణుమాధవ్‌తో కలిసి తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు ఉచితంగా అందించిన ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ సౌకర్యాలను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందిస్తూ, కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించాలన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరేశ్, పంచాయతీ కార్యదర్శులు రాజు, పరమేశ్వర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

డోర్నకల్, జూన్ 28 : గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని శుక్రవారం పలువురు కార్మికులు ఎంపీవో మున్వర్ అలీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదారు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరన్న, భిక్షమయ్య, రాంబాబు, వెంకన్న పాల్గొన్నారు.

నేడు మరిపెడ మండల సభ

మరిపెడ, జూన్ 28 : మరిపెడ మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం ఎంపీపీ గుగులోత్ అరుణా ర